క్లుప్తంగా

చిన్నారుల సందడి



ఎబిలిటీ చిల్డ్రన్ పార్క్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

బీచ్‌రోడ్డు : తీరంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ఎబిలిటీ పార్క్‌లో చిన్నారులు శుక్రవారం తమ ఆట పాటలతో సందడి చేశారు. పార్క్‌లోని జారుడుబల్ల, జాంపింగ్ తదితర ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేశారు. కొన్నాళ్లుగా ఈ పార్క్‌ను మరమ్మతుల కోసం మూసేశారు. చాలా రోజుల తరువాత తిరిగి ప్రారంభించటంతో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఆట పాటలతో గడిపారు.

బయోఫిజికల్ కెమిస్ట్రీ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య రఘురామారావు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం పూర్వ విద్యార్థి, ఐఐటీ చెన్నై పూర్వ ఆచార్యులు సి.కాళిదాస్ రచించిన బయోఫిజికల్ కెమిస్ట్రీ పుస్తకాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ ఆచార్యులు జి.రఘురామారావు ఆవిష్కరించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాశ్చాత్య దేశంలో ఇప్పటికే ప్రాచుర్యం పొందిన బయోఫిజికల్ కెమిస్ట్రీపై భారత దేశంలో విద్యార్థులకు ఉపయుక్తంగా ఆచార్య కాళిదాసు ఈ పుస్తకాన్ని రచించారు. ఆవిష్కరణలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

బీచ్‌రోడ్డు : ఆర్కేబీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్కేబీచ్ దరి స్విమ్మింగ్ పూల్ ఎదురుగా ఉన్న తీరంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో గుర్తు తెలియని ఒక మృతదేహం లభ్యమైంది. ఎరుపు రంగు చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ వేసుకున్న ఆ వ్యక్తి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్ర పర్చామన్నారు. మృతదేహాన్ని గుర్తించిన వారు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భూములపై సీపీఎం పాదయాత్ర

ఆరిలోవ : ముడసర్లోవ భూములను ప్రైవేట్ పరం చేయొద్దంటూ సీపీఎం నాయకులు శుక్రవారం పదో వార్డులో పాదయాత్ర నిర్వహించారు. ముడసర్లోవ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన 283 ఎకరాల భూములు పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి వ్యతిరేకంగా సీపీఎం నాయకులు ఆరిలోవ ప్రాంతంలో మూడు రోజులుగా పాదయాత్ర చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పదో వార్డు పరిధి రవీంద్రనగర్ నుంచి ఆదర్శనగర్ మీదుగా డెయిరీఫారం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ భూములపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి. కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవలో బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయం

ఆరిలోవ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తూర్పు నియోజకవర్గ స్థాయి ఎన్నికల కార్యాలయాన్ని ఆరిలోవలో బీజేపీ ఏర్పాటు చేసింది. స్థానిక దుర్గాబజార్‌లో ఈ కార్యాలయాన్ని శుక్రవారం ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి పి.వేణుగోపాలం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జూలో.. మరిన్ని సొగసులు



జూలో బయోస్కోప్‌పై నిర్మిస్తున్న అదనపు శ్లాబ్



హిమాలయన్ బేర్ ఎన్‌క్లోజర్ పక్కన నిర్మిస్తున్న కొత్త ఎన్‌క్లోజర్

ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల(జూ)కు మరిన్ని హంగులు చేరనున్నాయి. జూలోని జీవుల సౌకర్యార్థం కొన్ని, సందర్శకుల కోసం మరికొన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐవోసీఎల్ సీఎస్సార్ నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన ఈ నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే కొన్ని పూర్తవగా, మిగిలిన వాటిని మార్చికల్లా పూర్తి చేయనున్నారు. వేసవినాటికి ఈ నిర్మాణాలు పూర్తి చేసుకుని సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచనున్నట్టు అధికారులు చెప్తున్నారు.

- శరవేగంగా కొత్త నిర్మాణాలు, ఎన్‌క్లోజర్లు
- ఐవోసీఎల్ సీఎస్సార్ నిధులతో ఏర్పాటు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో అధికారులు కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటివరకు ఇక్కడ వన్యప్రాణులు కోసం సుమారు 70 నిర్మాణాలు/ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. ఇటీవల ఇక్కడికి ఇతర జూ పార్కుల నుంచి కొత్త జంతువులను తీసుకొచ్చారు. వాటి కోసం ప్రత్యేకంగా కొత్త ఎన్‌క్లోజర్లు నిర్మించారు. ఇవే కాకుండా మరికొన్ని భవనాలు నిర్మాణంలో ఉన్నాయి.

ఐవోసీఎల్ సహకారంతో

జూ అభివృద్ధి కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) సీఎస్ఆర్ నిధులు కేటాయించింది. గత ఏడాది జూ అధికారులతో పరస్పర అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుని సుమారు రూ.2 కోట్లు అందించింది. ఆ నిధులతో జూ అధికారులు నూతన భవనాలు, ఎన్‌క్లోజర్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో కొన్ని ఇప్పటికే పూర్తవగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రస్తుతం రూ.40 లక్షలతో బయోస్కోప్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుత బయోస్కోప్ శ్లాబ్‌పై గత వారం అదనంగా మరో శ్లాబ్ వేశారు. ఈ ఫ్లోర్‌ను జూకి సంబంధించి సమావేశాలు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించే విధంగా తీర్చిదిద్దుతున్నారు.

మార్చిలోగా నిర్మాణాలు పూర్తి

దీంతో పాటు మిగిలిన నిధులతో సందర్శకుల కోసం పాముల జోన్ సమీపంలో ఆధునిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. కణుజుల ఎన్‌క్లోజర్‌కు ఎదురుగా ఓ నూతన ఎన్‌క్లోజర్, హిమాలయన్ బేర్ ఎన్‌క్లోజర్ పక్కన మరో ఎన్‌క్లోజర్ నిర్మాణంలో ఉన్నాయి. ఐవోసీఎల్, జూ అధికారులు మధ్య జరిగిన ఒప్పందం మేరకు కేటాయించిన సీఎస్సార్ నిధులతో ఈ ఏడాది మార్చిలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో అధికారుల చొరవ తీసుకుని నిర్మాణాలు శరవేగంగా జరిగేలా సంబంధిత యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్నారు.

తీరంలో చెత్త తొలగింపు



మొక్కలు నాటేందుకు డివైడర్లపై గోతులు తవ్వుతున్న కూలీలు



తీరంలో చెత్తను తరలిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు : తీరంలో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ సిబ్బంది సేకరించి తరలిస్తున్నారు. జీ–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో తీరంలో ఉన్న చెత్తను శుభ్రం చేసి తీరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. తీరంలో కొబ్బరి చెట్ల వద్ద పడిపోయిన కొబ్బరి మట్టలు, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి జీవీఎంసీ వాహనంలో తరలిస్తున్నారు. మరో వైపు బీచ్‌రోడ్డు మొత్తం పచ్చదనంతో నింపేందుకు మొక్కలను నాటుతున్నారు. దీంతో తీరం మరింత సుందరంగా తయారవుతోంది.

కుల గణనకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురండి



విజయసాయిరెడ్డికి బీసీల సమస్యలను వివరిస్తున్న వేణుమాధవ్

బీచ్‌రోడ్డు : కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జనగణన చేపట్టనున్న నేపథ్యంలో కుల గణన కూడా జరిపేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని వైఎస్సార్‌సీపీ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ విజయసాయిరెడ్డిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ కోరారు. పార్లమెంట్ సమావేశాలను ముగించుకుని విశాఖ వచ్చిన విజయసాయిరెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందించారు. వైఎస్సార్‌సీపీతో పాటు ఇతర పార్టీలతో కలిసి కులగణన జరిగేలా కృషి చేయాలని కోరారు. అలాగే బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటయ్యేలా కూడా ప్రయత్నించాలన్నారు. వీటిపై విజయసాయి రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

శ్రీనివాస కల్యాణోత్సవం రేపు



కల్యాణ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

సీతంపేట: లోక కల్యాణార్థం ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సీతమ్మధార టీపీటీ కాలనీ ద్రవిడ సంక్షేమ సంఘం శ్రీలలితా నూకాల కామేశ్వరి కల్యాణ మండపంలో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు శృతిలయ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు యు.ప్రభాకర్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం కల్యాణోత్సవ ఆహ్వాన పత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉదయం 10 గంటలకు అన్నమాచార్య సంకీర్తన, మధ్యాహ్నం 3 గంటలకు సీతమ్మధార త్రిమూర్తికా వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి కోలాటం, నృత్యాలతో తిరువీధి మహోత్సవం కల్యాణ మండపం వరకు జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు వైఖానస ఆగమ సంప్రదాయంలో పాణంగిపల్లి రంగనాథాచార్య స్వామి బృందంచే శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తి గీతాలాపన, నవ చైతన్య కళా నాట్య మండలి సభ్యులచే శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఉంటుందన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులకు శేషవస్త్రాలు, స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కల్యాణోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఎం.వి.రాజశేఖర్, ఎమ్మెస్ మాధవ్, మేడా మస్తాన్‌రెడ్డి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎన్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులకు బాసటగా దిశ పోలీస్ స్టేషన్లు

పీఎం పాలెం: వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి దిశ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాలల పట్ల పోలీస్ సిబ్బంది ప్రేమానురాగాలు కనబరిచి వారికి రక్షణగా నిలవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన దిశ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ సమావేశ హాలులో పోలీసు, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ వార్డు మహిళా కార్యదర్శులు, జిల్లా బాలల సంరక్షణ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలల పరిరక్షణే ధ్యేయంగా నెలకొల్పిన దిశ పోలీస్ స్టేషన్ సేవలు ప్రజలకు చేరువ చేసి ఆపదలో ఉన్న వారికి బాసటగా నిలవాలన్నారు. స్టేషన్‌లో బాలల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆటవస్తువుల ప్లేరూమ్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు–బాలల హక్కులు చట్టాలపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. స్థానిక ఏసీపీ వివేకానంద్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యుడు సీతారామ్ ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు మరింత మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ ఇన్‌చార్జి అధికారి రమేష్, 1098 చైల్డ్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్‌రాజు, సబ్ ఇన్స్‌పెక్టర్లు రూపవతి, నీలిమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల, జిల్లా కన్వీనర్ బి.లవకుశ, పోలీసు సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో పార్వతీపరమేశ్వరులు



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: పండితుల వేదమంత్రాలు, మేళతాళాల మధ్య ఆదిదంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. 25వ వార్డు సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో పార్వతీపరమేశ్వరుల 33వ వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. పలు రకాల పండ్లతో చూడముచ్చటగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై ప్రత్యేక అలంకరణలో ముస్తాబైన పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు పండితుల వేదమంత్రాల నడుమ కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, పూల దండలు, ఆభరణాలతో చక్కగా అలంకరించారు. కంకణధారణ, సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అష్ట రాజార్చన, వాస్తుపూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన నిర్వహించారు. ఆగమ పండితుడు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ, ఈవో జగన్నాథరావు పర్యవేక్షణలో కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు అందజేశారు.

నేడు ఊరేగింపు..

ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు పార్వతీశ్వర స్వామి ఊరేగింపు మేళతాళాలతో జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం ఏకాంత సేవ నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ప్రతీ దరఖాస్తుకు రసీదు తప్పనిసరి

మధురవాడ: సచివాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తు, ఫిర్యాదుకు కచ్చితంగా రసీదు ఇచ్చి, నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలని జీవీఎంసీ మధురవాడ జోన్–2 కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి ఆదేశించారు. జోనల్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సచివాలయ మ్యాపింగ్, సిటిజన్స్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేశారు.

13న కలెక్టరేట్ల వద్ద బీజేపీ నిరసనలు

ఎంవీపీకాలనీ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 26 పథకాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు చేయనున్నట్లు బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి తెలిపారు. శుక్రవారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. మూడున్నర సంవత్సరాలుగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలను ఇవ్వట్లేదన్నారు. ఆయా అంశాలపై బీజేపీ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద 24 గంటల పాటు ఈ ధర్నాలు జరుగుతాయన్నారు. సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.

భోజన పథకాన్ని పరిశీలించిన ఎంఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో బాలామణి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలస, రామజోగి అగ్రహారంలో గల మండల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో కేపీ బాలామణి సందర్శించారు. ముందుగా పాఠశాలలో అమలవుతున్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో రాత పుస్తకాలు, ఉపాధ్యాయుల డైరీలు, పాఠ్య ప్రణాళికలు, లీడ్ కార్యక్రమం రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులతో పాటు పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు కూడా విద్యార్థులపై దృష్టి సారించాలని తెలిపారు. ఉన్నతాధికారుల సందర్శన సమయంలో ప్రతి ఒక్క టీచర్ ఆయా తరగతులకు సంబంధించిన ప్రోగ్రెస్ కార్డులు, రికార్డులు జాగ్రత్తగా భద్రపరిచి ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ ఎం.కొండ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కఠిన చర్యలు

రూరల్ తహసీల్దార్ రమణయ్య



ఆరిలోవ : రూరల్ మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సనపల రమణయ్య హెచ్చరించారు. ఇక్కడ ఇంతవరకు పనిచేసిన పాల్ కిరణ్ కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రమణయ్య గురువారం బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ పరిధి అటు కొమ్మాది, మారికవలస, రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, విశాలాక్షినగర్ నుంచి ఇటు సింహాచలం, అడవివరం, ముడసర్లోవ, ఆరిలోవ, డెయిరీఫారం ప్రాంతం వరకు సువిశాలమైనదన్నారు. విశాలమైన ఈ పరిధిలో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల ఒత్తుళ్లు ఎక్కువగానే ఉంటాయి. ఇక్కడ విధులు నిర్వహించడం ఓ సవాల్ లాంటిదే. ఏది ఏమైనా తన విధులు బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను రక్షించడంతో పాటు జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాధాన్యతా కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. ప్రజలకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం లేకుండా సకాలంలో అందిస్తామన్నారు. మధురవాడ, ఎండాడ, రుషికొండ, ఆరిలోవ, ముడసర్లోవ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో తరుచూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టిలో ఉందన్నారు. మండలం పరిధిలో ప్రభుత్వ ఆస్తులు కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. వాటిని ఆక్రమిస్తే ఎలాంటివారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విశ్వహిందీ సమ్మేళనానికి ఆచార్య ఇక్బాల్



ఆచార్య ఇక్బాల్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఎస్.ఎం.ఇక్బాల్ అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 15 నుంచి 17 వరకు ఫిజీ దేశంలో భారత ప్రభుత్వం నిర్వహించే 12వ విశ్వహిందీ సమ్మేళనంలో ఆచార్య ఇక్బాల్ పాల్గొననున్నారు. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా వెయ్యిమందికి పైగా ప్రతినిధులు హాజరవుతారు. ఈ సదస్సులో ఆచార్య ఇక్బాల్ 'రాజభాష హిందీని రాష్ట్ర భాష హిందీ అనడం ఎందుకు అవసరం'అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పిస్తారు. ఏయూ హిందీ విభాగంలో ఆచార్య ఇక్బాల్ 37 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ పొందారు. సమ్మేళనానికి హాజరుకానున్న సందర్భంగా ఆచార్య ఇక్బాల్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి



చేనేత చీరను పరిశీలిస్తున్న జయేష్ కుమార్ తదితరులు

బీచ్‌రోడ్డు: చేనేత హస్తకళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గ్రామీణ హస్తకళల సంస్థ కార్యదర్శి జయేష్ కుమార్ గుప్తా అన్నారు. బీచ్ రోడ్డులోని నోవాటెల్‌లో గ్రామీణ హస్తకళల సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ గ్రామాల్లో లభ్యమయ్యే హస్తకళా ఖండాలను ఈ ఎక్స్‌పో ద్వారా విశాఖ వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. 50కి పైగా స్టాల్స్‌తో ఈ ఎక్స్‌పో 14వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

15న తెలుగు విభాగం ఫ్రెషర్స్ డే



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్థులు ఈ నెల 15న ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు శుక్రవారం తెలిపారు. ఫ్రెషర్స్ డే ద్వారా విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలను నిర్వహించారు. నూతన విద్యార్థుల్లో ఉన్న భయాలను తొలగిస్తూ వారిలో శారీరక, మానసిక ఉల్లాసానికి తోడ్పడేలా ఆటపాటల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ అనే భేదం లేకుండా అంతా ఒక్కటై పోటాపోటీగా కార్యక్రమాలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.

విద్యాతరంగిణి చీఫ్ వార్డెన్‌గా వినుత



హాస్టల్ వార్డెన్‌గా ఉత్తర్వులు స్వీకరిస్తున్న డాక్టర్ వినుత

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పెరిగిన విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా వారి వసతి కోసం విద్యాభవన్‌ని విద్యార్థినుల హాస్టల్‌గా తీర్చిదిద్ది విద్యాతరంగిణిగా మార్పు చేశారు. ఈ హాస్టల్ ఇన్‌చార్జి చీఫ్ వార్డెన్‌గా ఏయూ అప్లయిడ్ మేథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వినుత నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్‌కిషోర్ బాబు నుంచి ఆమె ఉత్తర్వులు స్వీకరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ వినుతను ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఏ.కె.ఎం.పవార్ తదితరులు అభినందించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఎంవీపీకాలనీ : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిస్సాకు చెందిన జైసేన, బిపేంద్ర అనే ఇద్దరు యువకులు అరకు నుంచి 3 కిలోల గంజాయిని విశాఖకు తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి ఒడిస్సాకు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నారు. వారిని ఫోర్త్ టౌన్ పోలీసులకు అప్పగించగా, అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

PUBLIC NOTICE

My client **Sri Amarvarasai Vamsi Krishna Rayudu, S/o. Rayudu Rama Rao,** Residing at Door No. 4-20/8, Shanmukha Sai Balaji Nilayam, P.M. Palem, Visakhapatnam.

They instructed me to issue this general notice informing the public that, My client intends to purchase the Schedule property from **1) Sri Bejjam, Rajendra Rao, S/o. B. Peda John,** residing at P.M. Palem, Visakhapatnam, **2) Sri Bavarisetty Uday Kumar, S/o. B. Appala Raju,** residing at Visalakshinagar, Visakhapatnam & **3) Smt. Arji Ravithalli, W/o. Desetti Seetharam,** residing at Town Kotha Road, Visakhapatnam.

They acquired the property under 3 registered sale deeds vide Document Numbers, **1) 4065/2011, dated 21.10.2011, 2) 3376/2011, dated 03.09.2011 from Smt. Muvvala Varalakshmi, rep. by her GPA Holder M/s. Surekha Constructions rep. by its Managing Partner Sri Bayana Jithendra & 3) 4288/2014, dated 30.07.2014 from Smt. Muvvala Varalakshmi.**

Hence any person having objections, claim, interest over the below said property may inform me or my client within 10 days from the date of this publication, failing which, my client will treat that there are no objections and proceed with the sale transaction.

SCHEDULE OF PROPERTY

All that piece of site measuring an extent of 269 Sq.Yards or 224.918 Sq.Mtrs., situated in Plot No.123 of layout approved by VUDA vide L.P.No.37/91, covered by S. No. 26/2B, consisting of Stilt, Ground + 2 Floors in the name & style of **"PRANAY RESIDENCY"** (each floor measuring 1500 Sq. Ft and 6 Car Parking each measuring 80 Sq. Ft in Stilt Floor) of Madhurawada Village, within the limits of Greater Visakhapatnam Municipal Corporation, Madhurawada S.R.O., Visakhapatnam Dist., and **Bounded by : East** : 33 Feet wide Road, **South** : 40 Feet wide Road, **West** : Plot No.113 & 114, **North** : Plot No.122.

B. Anantha Lakshmi (Advocate)
Carshed Junction, Madhurawada, VSP-41. Ph No.99632 34888